సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 18 । మార్చి । 2023



108లో సుఖ ప్రసవాలు

వేర్వేరు మండలాలకు చెందిన ఇద్దరు గర్భిణులను 108లో ఆస్పత్రులకు తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవించారు. IIలో



సీఎంను కలిసిన ఎంపీ మాధవి

పాడేరు: ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



గిరిజన ప్రాంతాలపై అధ్యయనం

గిరిజన ప్రాంతాల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు యాత్ర నిర్వహిస్తున్నామని అటవీ శాఖ ఉన్నతాధికారి రమణమూర్తి తెలిపారు. IIలో

న్యూస్‌రీల్

జాబ్ మేళాలో 12 మంది ఎంపిక



యువతకు ఎంపిక పత్రాలు అందజేస్తున్న ప్రశాంత్‌కుమార్

అరకులోయ రూరల్: నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పన జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో డెక్కన్ ఫైన్‌కెమికల్స్, వైఎస్‌కే ఇన్ఫోటెక్, ఫాదర్ అండ్ మదర్ హోమ్ కేర్ సర్వీస్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. నిరుద్యోగ యువత 29 మంది హాజరు కాగా వీరిలో 12 మందిని ఎంపిక చేసినట్టు ఉపాధి కల్పన జిల్లా నైపుణ్యాధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మహిళ కబడ్డీ జట్టు ఎంపిక రేపు

పాడేరు రూరల్ : హర్యానాలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర సీనియర్ మహిళా జట్టు ఎంపిక ఆదివారం గుంటూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఆసక్తి గల క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొనవచ్చని తెలిపారు.

క్రీడా ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం


పాడేరు రూరల్ : ఓఎన్‌జీసీ క్రీడా ఉపకార వేతన పథకం కోసం 2023–24 సంవత్సరానికి జాతీయ స్థాయిలో సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని శాప్ పరిపాలనాధికారి జి.ధర్మారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 22 క్రీడాంశాల్లో 250 మందికి ఉపకార వేతనాలను ఓఎన్‌జీసీ సంస్థ అందిస్తోందన్నారు. ఒక్కో అథ్లెట్‌కు నెలకు రూ.15వేల నుంచి రూ.30వేల వరకు వేతనాలు సమకూరుస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులు ఓఎన్‌జీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. మరిన్ని వివరాలకు 7780117696 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రాధాన్యత గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ సభలు

వీఆర్‌పురం: గోదావరి వరదల్లో ముంపునకు గురై కాంటూరుతో సంబంధం లేకుండా ముంపు జాబితాలో చేర్చబడిన పది గ్రామాల్లో ఈ నెల 21 నుంచి ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ ఎస్.శ్రీధర్ తెలిపారు. ఈ నెల 21న రామవరప్పాడు,23న ప్రత్తిపాక,24న గుండుగుడెం,25 న ధర్మతాళ్లగుడెం,27న రాజుపేటకాలనీ,28 అడవివెంకన్నగుడెం, 29న చింతరేగుపల్లి, 31న వడ్డిగుడెం, ఏప్రిల్ ఒకటిన వడ్డిగూడెం కాలనీ, రెండు నుంచి మూడు రోజుల పాటు వీఆర్‌పురంలో గ్రామ సభలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ గ్రామసభల్లో సోషల్ ఎకనామికల్ సర్వే (ఎస్ఈఎస్) లో నమోదు చేసిన కుటుంబ వివరాలు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు సంబంధించిన వివరాలను చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు.

2 ప్రాజెక్టులు.. 20 వేల ఎకరాలు

ఐదు మండలాల రైతులకు మంచి రోజులు వస్తున్నాయి. దుమ్ముకొండ, కన్నేరు వాగులపై సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. ఇవి కార్యరూపం దాల్చితే సుమారు 20 వేల ఎకరాలు సస్యశ్యామలం కానున్నాయి.



గన్నవరం సమీపంలో ప్రవహిస్తున్న దుమ్ముకొండ వాగు

- దుమ్ముకొండ, కన్నేరు వాగులపై నిర్మాణం
- ప్రతిపాదనలు రూపొందిస్తున్న అధికారులు
- ఐదు మండలాల రైతులకు ప్రయోజనం

వై.రామవరం: మండలంలో ఎత్తయిన కొండల్లో దుమ్ముకొండ ఒకటి. మండల కేంద్రానికి అతి సమీపంలో మూడు కిలోమీటర్ల దూరంలో ఈ కొండ విస్తరించి ఉంది. దీనిపై ఏడాది పొడవునా జీవనదిలా ప్రవహించే జలధార నీరు వృథా అవుతోంది. ఇది రెండు వాగులుగా విడిపోయి ప్రవహిస్తోంది. మండలంలోని గ్రామాల మీదుగా ప్రవహించే దీనిని దుమ్ముకొండ వాగుగా, కోట శివారు సిరిమెట్ల గ్రామ సమీపంలో ప్రవహించే దానికి కన్నేరు వాగుగా పిలుస్తుంటారు. మండలంలో ఈ రెండు వాగులు మండు వేసవిలో సైతం నిండుగా ప్రవహిస్తుంటాయి. ఈ



సిరిమెట్ల సమీపంలో ప్రవహిస్తున్న కన్నేరు వాగు

నీటిని సాగుకు అనువుగా మార్చగలిగితే ఐదు మండలాల రైతులకు ఇబ్బందులు తప్పుతాయని పలువురు సూచిస్తున్నారు. మండలంలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడం వల్ల రైతులు వర్షాధారంపై ఆధారపడాల్సి వస్తోంది. **దుమ్ముకొండ, కన్నేరువాగుపై సాగునీటి ప్రాజెక్టులను నిర్మించగలిగితే మండలం**తో పాటు సరిహద్దు ప్రాంతాలైన అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు చెందిన 20 వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుంది.

వీటిపై సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం వల్ల ఎటువంటి ముంపు సమస్య ఉండదు. అటవీప్రాంతంలోనే నీరు నిల్వ ఉంటుంది. పరిసర గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉండదని పరిసర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రెండు కొండలు ఉన్నందున వాటి మధ్య తక్కువ నిధులతో ప్రాజెక్ట్ పూర్తయ్యే అవకాశం ఉంటుంది. మినీ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

వేలాది ఎకరాలు సస్యశ్యామలం



దుమ్ముకొండ, కన్నేరు వాగులపై సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తున్నాం. వీటిని నిర్మించడం వల్ల ఐదు మండలాలకు చెందిన వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి. దీనివల్ల రైతులకు ఇబ్బందులు తప్పుతాయి.

– కడబాల ఆనందరావు, ఎంపీపీ, వై.రామవరం

కలెక్టర్‌కు విన్నవించాం



దుమ్ముకొండ, కన్నేరు వాగులపై సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని కలెక్టర్‌కు విన్నవించాం. వీటివల్ల కలిగే ప్రయోజనాలను వినతిపత్రం అందజేశాం. ఇవి కార్యరూపం దాల్చితే వేలాది ఎకరాల రైతులకు ఎంతో ప్రయోజనకరం.

– కర్రి వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ, వై.రామవరం

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

దుమ్ముకొండ, కన్నేరు వాగులపై సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. త్వరలో ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రాజెక్టుల నిర్మాణానికి తగిన స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి. ఏడాది పొడవునా ప్రవహించడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరం.

– శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ధవళేశ్వరం

రెవెన్యూ డివిజన్లలో పర్యటన తప్పనిసరి





మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ (ఇన్‌సెట్) సమావేశంలో పాల్గొన్న అధికారులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని రంపచోడవరం,చింతూరు డివిజన్లలో అన్నిశాఖల అధికారులు ప్రతినెల పర్యటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశమందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం నెలకు మూడు రోజులు అయిన ఆ రెండు డివిజన్‌లను సందర్శించి, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. శాఖలవారీగా సమీక్షలు జరిపి ఆయా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. స్పందనలో స్వీకరిస్తున్న వినతులపై అధికారులు సకాలంలో స్పందించాలని, ఇందుకు సంబంధించి విచారణ అధికారిగా ఒకరిని నియమించాలన్నారు. స్పందన అర్జీలను ఆర్థిక, ఆర్థికేతర తదితర అంశాలుగా విభజించాలని సూచించారు. ఆర్థిక అంశాలు, పాలసీ విషయాలకు సంబంధించి తగు విచారణకు ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. సీఎం కార్యాలయం నుంచి స్పందన అర్జీలపై నిరంతరం సమీక్షలు జరుగుతున్న పరిస్థితిని అధికారులు దృష్టిలో పెట్టుకుని పనిచేయాలన్నారు. స్పందన పిర్యాదులను ఫొటోలతో సహా వెబ్‌పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. కోర్టు కేసులకు వెంటనే అఫిడవిట్లు దాఖలు చేయాలని,తద్వారా వ్యక్తిగతంగా హాజరయ్యే పరిస్థితులు తగ్గుతాయన్నారు. వచ్చే వర్షాకాలంలో మూడు నెలలకు నిత్యావసరాలు నిల్వ ఉంచేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందించేందుకే ఆపద మిత్రలు

రంపచోడవరం: రాష్ట్రంలో విపత్తులు సంభవించినప్పుడు సహాయక చర్యలు చేపట్టే విధంగా ఆపద మిత్రులను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని రాష్ట్ర ఈవోపీఆర్ అండ్ ఆర్డీ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక యూత్ ట్రైనింగ్ (వైటీసీ) సెంటర్లో 11 మండలాలకు సంబంధించి వందమంది వలంటీర్ల ఆపదమిత్రలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈనెల 25 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. విపత్తులు సంభవించినప్పుడు 15 శాఖల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా ఒక్కొక్క శాఖ నుంచి ఒకొక్కరోజు ఈ శిక్షణ ఉంటుందన్నారు. డీఎల్డీవో కె. కోటేశ్వరరావు, డీఎల్పీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, ఈవోపీఆర్డీ జాన్ విల్సన్, డీపీఎం శ్రీనివాసరావు, ఈపీఎం కిరణ్మయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణమోహన్

ఆర్టీసీ సేవలు మరింత విస్తరణ

- పాడేరు డిపోకు అదనంగా బస్సులు
- సీలేరులో శాటిలైట్ డిపో
- ప్రారంభానికి చర్యలు
- ఆర్టీసీ ఈడీ రవికుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని ఆర్టీసీ సేవలను మరింత విస్తరించనున్నట్టు ఆ సంస్థ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు.డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ అప్పలనాయుడుతో కలిసి శుక్రవారం ఆయన స్థానిక డిపోను సందర్శించారు. డీఎం నాయుడుతో సమీక్షించారు. ఇటీవల తిరుపతి నుంచి పాడేరు డిపోకు వచ్చిన ఐదు బస్సులను వారు పరిశీలించారు.అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణను కలిశారు. డిపో అభివృద్ధి, బస్ సేవలు తదితర అంశాలపై వారితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఈడీ రవికుమార్ మాట్లాడుతూ పాడేరు డిపో నుంచి చింతూరుకు రెండు సర్వీసులు, ముంచంగిపుట్టు రూట్‌లో ఒకటి, అరకులోయ, చింతపల్లి రూట్‌లో రెండేసి బస్ సర్వీసులను అదనంగా నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా కేంద్రం ఏర్పడిన నాటి నుంచి పలు రూట్లలో ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు.



పాడేరు డిపోను సందర్శించిన ఈడీ రవికుమార్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ అప్పలనాయుడు

సీలేరు శాటిలైట్ డిపో స్థల పరిశీలన

పాడేరు డిపో సందర్శన అనంతరం జోన్–1ఈడీ రవికుమార్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ అప్పలనాయుడు సీలేరు వెళ్లారు. ఇక్కడ మూడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న శాటిలైట్ ఆర్టీసీ డిపోకు సంబంధించి ఎంపిక చేసిన స్థలాన్ని వారు పరిశీలించారు. సీలేరులో శాటిలైట్ డిపో ప్రారంభించడం ద్వారా మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని వారు పేర్కొన్నారు.

సెర్ఫ్ సీఈవో దృష్టికి ‘వైఎస్సార్ ఆసరా సమస్య’



సెర్ఫ్ సీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: అమరావతి సెర్ఫ్ సీఈవోను శుక్రవారం ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ (అనంత బాబు), రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కలిశారు. రంపచోడవరం నియోజకవర్గంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు పేర్కొన్నారు. ఎటపాక, వీఆర్ పురం మండలాల్లో 39 పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకానికి అర్హత ఉన్నప్పటికీ, పొదుపు చేసిన బ్యాంకులో సాంకేతిక కారణాల వల్ల లబ్ధి చేకూరలేదని వారు పేర్కొన్నారు. ఈ విషయం సీఈవో దృష్టికి తీసుకెళ్లగా, వీటన్నింటికీ వైఎస్సార్ ఆసరా పథకం వచ్చేలా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారని వారు తెలిపారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సేవా సంఘం (ఎఫ్‌పీవో) లో పనిచేస్తున్న అకౌంటెంట్లు, పారామిత్రలకు రూ. 5 వేల నుంచి రూ.10 వేలకు వేతనం పెంచాలని కోరినట్టు వారు వివరించారు. ఇందుకు ఆయన సుముఖత వ్యక్తంచేశారన్నారు.

రెండో ప్రాధాన్యత ఓటుతోనే ఫలితం

- మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరికీ దక్కని మ్యాజిక్ ఫిగర్
- కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- మొదటి ప్రాధాన్యత ఓట్లలో చిరంజీవిరావుకు 27,209 ఓట్ల ఆధిక్యం
- రెండో స్థానంలో సీతంరాజు, మూడో స్థానంలో రమాప్రభ


చిరంజీవిరావు


సీతంరాజు


రమాప్రభ

మొదటి ప్రాధాన్యత ఓట్లలో టాప్-4 అభ్యర్థుల ఓట్ల వివరాలివీ..

రౌండ్	మొత్తం ఓట్లు	చిరంజీవి	సీతంరాజు	రమాప్రభ	మాధవ్	చెల్లని ఓట్లు
1 రౌండ్	28,043	11,828	7,780	4,898	1,424	1,539
2 రౌండ్	27,991	12,274	7,619	4,669	1,280	1,557
3 రౌండ్	27,996	12,200	7,626	4,653	1,403	1,561
4 రౌండ్	28,005	11,517	7,813	4,788	1,563	1,688
5 రౌండ్	28,018	11,141	7,810	4,673	1,895	1,849
6 రౌండ్	28,080	10,861	7,966	5,451	1,338	1,923
7 రౌండ్	28,000	11,381	7,765	4,522	1,865	1,831
8 రౌండ్	5,200	1,755	1,330	1,494	116	370
పోస్టల్ బ్యాలెట్ 643						288

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరూ గెలుపునకు సరిపడా ఓట్లు సాధించకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లే గెలుపును నిర్ణయించనున్నాయి. శుక్రవారం నుంచి రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా సాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో అధికార పార్టీ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కంటే ప్రతిపక్ష టీడీపీ మద్దతు అభ్యర్థి వెంపాడ చిరంజీవిరావు ముందంజలో ఉన్నారు. మొత్తం 8 రౌండ్లు పూర్తయ్యే సరికి 27,209 ఓట్లతో టీడీపీ ఆధిక్యంలో ఉంది.

ఈ నెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నిక జరగ్గా 16న కౌంటింగ్ ప్రారంభమైంది. మొత్తం 2,89,214మంది పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోగా వీటిలో 2,00,926 ఓట్లు పోలయ్యాయి. గురువారం ఉదయం 7 గంటలకు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులు తీసుకొచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు కట్టలు కట్టే ప్రక్రియ జరిగింది. 7 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓటు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై.. మొత్తం 8 రౌండ్లలో శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఒక్కో రౌండ్‌కు 28 వేల ఓట్లు చొప్పున (2,00,926+355) ఓట్లను 8 రౌండ్లుగా విభజించారు.

12 వేలకు పైగా చెల్లని ఓట్లు

ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లోని సుమారు 800 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు పొందగా.. వీటిలో 643 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 288 ఓట్లను చెల్లనవిగా పరిగణించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు సాగిన మొత్తం ఎనిమిది రౌండ్ల లెక్కింపులో 12,318 వరకు చెల్లని ఓట్లు నమోదయ్యాయి. చెల్లని ఓట్లలో అధికంగా సీతంరాజు సుధాకర్‌కే వచ్చాయి.

34 మందికి డిపాజిట్లు గల్లంతు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 37 మంది అభ్యర్థులు ఉంటే.. వారిలో 34 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. వీరిలో బీజేపీ మద్దతు అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్ కూడా ఉన్నారు. మొత్తం చెల్లిన ఓట్లలో 1/6 వంతు ఓట్లు వచ్చిన అభ్యర్థికే డిపాజిట్లు వచ్చినట్టవుతుంది. అంటే 32 వేల ఓట్లు రావాలి. టీడీపీ మద్దతు అభ్యర్థి చిరంజీవిరావు (82,958 ఓట్లు) ముందంజలో ఉంటే.. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్(55,749 ఓట్లు) రెండో స్థానంలో ఉన్నారు. ఇక పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మిగిలిన 34 మంది డిపాజిట్లు కోల్పోయారు.

ఎవ్వరికీ దక్కని మ్యాజిక్ ఫిగర్

ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో మొత్తం 2,01,281 ఓట్లు పోల్ అవ్వగా.. ఇందులో 2,00,926 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 355 ఉన్నాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో చెల్లని ఓట్లు పోను (50 శాతం +1) 94,481+1 వస్తే గెలిచినట్లు డిక్లేర్ చేస్తారు. కానీ ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓటును ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

మన్యం కూల్ కూల్

- జిల్లావ్యాప్తంగా వర్షాలు
- 359 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వేకువజాము నుంచే వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి.గురువారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురవగా, రాత్రి తెరిపినిచ్చినప్పటికి శుక్రవారం ఉదయం నుంచి మళ్లీ వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ఇంటర్ పరీక్షలకు రాసే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి తేలికపాటి వర్షం కురవడంతో ఇక్కడి వారపుసంతకు ఆటంకం ఏర్పడింది. సంత జరిగే పాతబస్టాండ్, సుండ్రుపుట్టు రోడ్డు ప్రాంతాలు జనసంచారం లేక బోసి పోయాయి.

అరకు ప్రాంతంలో జల్లుతో కూడా వాన కురిసింది. జీడి, మామిడి పూత రాలిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రబీ వరి, కూరగాయల పంటలు, కాఫీ తోటలకు మేలు చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో అన్ని మండలాల రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ అప్రమత్తం చేశారు.

వర్షపాతం వివరాలిలా..

జిల్లాలో 22 మండలాలకు సంబంధించి శుక్రవారం 359 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని కలెక్టరేట్‌లోని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. అత్యధికంగా అడ్డతీగలలో 50.2 ఎంఎం, అత్యల్పంగా రాజవొమ్మంగిలో 1.8 ఎంఎం నమోదైందని వారు పేర్కొన్నారు. పెదబయలులో 42.2, అనంతగిరిలో 40.2, ఎటపాకలో 32.2, వై.రామవరంలో 25.4, హుకుంపేటలో 21.4, అరకులోయలో 19.2, చింతపల్లిలో 18.2, చింతూరులో 16.2, ముంచంగిపుట్టులో 16.2, డుంబ్రిగుడలో 13.2, రంపచోడవరంలో 12.2, కూనవరంలో 12.2, జీకే వీధిలో 10.2, జి.మాడుగులలో 8.4, గంగవరంలో 5.6, వీఆర్‌పురంలో 4.4, కొయ్యూరులో 4.2, పాడేరులో 3.2, మారేడుమిల్లిలో 2.2 ఎంఎం వర్షపాతం నమోదైందని వారు తెలిపారు.





వర్షంతో బోసిపోయిన పాడేరు వారపు సంత (ఇన్‌సెట్) వర్షం కారణంగా జనసంచారం తక్కువగా ఉన్న పాడేరు పాత బస్టాండ్

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- 28 వినతుల స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: స్పందనలో గిరిజనుల నుంచి స్వీకరించిన వినతులకు సంబంధించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ గిరిజనుల నుంచి 28 వినతులు స్వీకరించారు. గిరిజనుల నుంచి కలెక్టర్ సమస్యలు తెలుసుకున్నారు. పాడేరు మండలం దుమ్మాపుట్టు, వల్లాపురం గ్రామాల పరిధిలోని 300 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించే విధంగా చెక్‌డ్యామ్ నిర్మించాలని సర్పంచ్ కె.సన్నిబాబు కోరారు. వనుగుపల్లి పంచాయతీలోని బొడ్డగొంది గ్రామానికి ఉపాధి హామీ పథకంలో మట్టి రోడ్డు నిర్మించారని, వర్షాలు కురిస్తే బురద రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, సీసీరోడ్డు నిర్మించాలని ఎస్.రమేష్‌బాబు, ఎస్.రామారావు ఇతర గిరిజనులు విన్నవించుకున్నారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ వాముగెడ్డ గ్రామంలో జియో నెట్ వర్క్‌కు సంబంధించి సెల్‌టవర్ నిర్మించాలని గ్రామస్తులు బాలకృష్ణ, నాగరాజు కోరారు. అలాగే పలు గ్రామాల గిరిజనులు తమ వ్యక్తిగత, గ్రామాల సమస్యలపై వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఈవో సలీంబాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, వేణుగోపాల్, కొండయ్యపడాల్, లావణ్యకుమార్, లీలాకృష్ణ, డీఎల్పీవో పీఎస్‌కుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వన్డే మ్యాచ్.. ట్రాఫిక్ ఆంక్షలు



దొండపర్తి : భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల 19న డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మ్యాచ్‌కు 27 వేల మంది క్రికెట్ అభిమానులు రానున్నారు. వీరితో సాధారణ వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు పలు సూచనలు చేశారు.

- మ్యాచ్ మధ్యాహ్నం 1.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు జరగనుంది. ఈ మ్యాచ్‌ను చూసేందుకు 27 వేల మంది రానున్నారు. వేల సంఖ్యలో వచ్చే వాహనాలతో స్టేడియం పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోతాయి. దీంతో సాధారణ వాహనదారులు ఆయా సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి విశాఖకు వచ్చే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు మారికవలస వద్ద ఎడమ వైపు తిరిగి జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరుకోవాలి. అక్కడి నుంచి కుడి వైపు తిరిగి బీచ్ రోడ్డులో ప్రయాణించి రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం మీదుగా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి కార్ షెడ్ వద్ద నుంచి మిథిలాపురి కాలనీలో ప్రవేశించాలి. అలా ఎంవీపీ సిటీ వెనుకగా వెళ్లి లా కాలేజీ రోడ్డు మీదుగా ఎన్‌హెచ్ 16 చేరుకుని నగరంలోకి వెళ్లాలి. లా కాలేజీ రోడ్డు నుంచి, పనోరమ హిల్స్ మీదుగా రుషికొండ వైపు వెళ్లి అక్కడి నుంచి నగరంలోకి వెళ్లవచ్చు.
- నగరం నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు ఇతర కమర్షియల్ వాహనాలు హనుమంతవాక నుంచి ఎడమ వైపు తిరిగి, ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్లి, అడివివరం వద్ద కుడి వైపు తిరిగి ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- నగరం నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి హనుమంతవాక జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరగాలి. అడవివరం మీదుగా ఆనందపురం వెళ్లవచ్చు. అలాగే విశాఖ వాలీ, ఎండాడ జంక్షన్ నుంచి కుడి వైపు తిరిగి, బీచ్‌రోడ్డుకు చేరుకుని తిమ్మాపురం వద్ద ఎడమవైపు తిరిగి మారికవలస వద్ద ఎన్‌హెచ్ 16కు చేరుకోవాలి.

భారీ వాహనాలకు సూచనలు

- 19వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఎటువంటి భారీ వాహనాలు మధురవాడ స్టేడియం వైపు అనుమతించరు.
- అనకాపల్లి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలు, నగరంలోకి రాకుండా సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు నగరంలోకి రాకుండా, ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు వెళ్లాలి.
- అనకాపల్లి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే భారీ వాహనాలన్నీ అనకాపల్లి వైపు నుంచి సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి విశాఖకు వచ్చే భారీ వాహనాలన్నీ ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి మీదుగా నగరానికి చేరుకోవాలి.

మ్యాచ్‌కు వచ్చే వాహనచోదకులకు సూచనలు

- నగరం వైపు నుంచి స్టేడియానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ వాహనచోదకులు ఎన్‌హెచ్ 16లో స్టేడియం వరకు ప్రయాణించి, ఏ, బీ గ్రౌండ్లు, వీ కన్వెన్షన్‌కు పాసుల ప్రకారం చేరుకోవాలి.
- విశాఖ నుంచి స్టేడియానికి వచ్చే టికెట్ ఉన్నవారు ఎన్‌హెచ్ 16లో ప్రయాణించి స్టేడియం వద్ద గల ఓల్డేజ్ జంక్షన్ వద్ద ఎడమ వైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఆన్‌లైన్ టికెట్లను ఒరిజినల్ టికెట్లుగా మార్చుకునేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం, గంభీరం, బోయపాలెం, కొమ్మాది వైపు నుంచి వచ్చే వారు కార్ షెడ్ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ పార్కింగ్ గ్రౌండ్‌కు చేరుకోవాలి. లేదా కారుషెడ్ జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరిగి మిథిలాపురి కాలనీ మీదుగా వచ్చి.. ఎంవీపీ సిటీ డబుల్ రోడ్డు, పోలిశెట్టి వేణుగోపాలరావు గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- నగరం నుంచి లేదా భీమిలి వైపు నుంచి బీచ్ రోడ్డు మీదుగా స్టేడియానికి వచ్చే వారు ఐటీ సెజ్ మీదుగా ఎంవీపీ సిటీ డబుల్ రోడ్డుకు చేరుకుని అక్కడ పార్కింగ్ చేసుకోవాలి.
- నగరం నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఎన్‌హెచ్ 16లో రాకుండా, బీచ్‌రోడ్డులో వచ్చి ఐటీ సెజ్ మీదుగా లా కాలేజీ రోడ్డులో పార్కింగ్ చేయాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు, మారికవలస, తిమ్మాపురం, ఐటీ సెజ్ మీదుగా వచ్చి లా కాలేజీ రోడ్డుకు చేరుకుని పార్కింగ్ చేయాలి.
- పూర్తి భద్రతతో ఎటువంటి అపశ్రుతులూ జరగకుండా స్టేడియం చుట్టూ బారికేడ్లు ఏర్పాటుచేశారు.
- ప్రేక్షకులు టికెట్లలో నిర్దేశించిన గేట్ల ద్వారా మాత్రమే స్టేడియంలోకి ప్రవేశించాలని పోలీసులు సూచిస్తున్నారు.
- ముఖ్యమైన పాయింట్లలో ఏసీపీ స్థాయి అధికారులను నియమించారు.
- స్టేడియం చుట్టూ మూడు అంచల భద్రత ఏర్పాటు చేశారు.

నేడు భారత్–ఆస్ట్రేలియా జట్ల రాక

- స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల పరిశీలన

విశాఖ స్పోర్ట్స్: భారత్–ఆస్ట్రేలియా రెండో వన్డే మ్యాచ్‌కు వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. ఆదివారం డే నైట్‌గా జరగనున్న ఈ మ్యాచ్‌కు స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లను శుక్రవారం వన్డే నిర్వాహక కమిటీ పరిశీలించింది. స్టేడియం అంతటా ఏ విధంగా ఫ్లడ్‌లైట్ల వెలుతురు ఉందనే విషయాన్ని పరిశీలించిన కమిటీ చైర్మన్, విశాఖ పోర్టు చైర్మన్ కె.రామ్మోహనరావు కాసేపు బ్యాటింగ్ చేశారు. తొలుత నిర్వాహక కమిటీ భేటీలో ఏర్పాట్లను సమీక్షించారు. టికెట్ల విక్రయంతో పాటు ప్రవేశ ద్వారాల వద్ద బార్‌కోడ్ పరిశీలన ఏర్పాట్లు, అనౌన్స్‌మెంట్, స్టేడియం వద్దకు వచ్చే వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, మంచినీరు, ఆహార పదార్థాల విక్రయం తదితర విషయాలపై చర్చించారు. మూడంచెల భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, ఈపీడీసీఎల్ ఎండీ సంతోష్‌రావు, ఏసీఏ, వీడీసీఏ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న నిర్వాహక కమిటీ చైర్మన్ కె. రామ్మోహనరావు

నేడు ఇరుజట్ల రాక

సిరీస్ తొలిమ్యాచ్‌లో విజయంకేతనం ఎగురవేసిన భారత్ జట్టుతో పాటు ఆస్ట్రేలియా జట్టు సభ్యులు శనివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో నగరానికి చేరుకోనున్నారు. తొలి మ్యాచ్‌కు కుటుంబ కార్యక్రమం కోసం వెళ్లిన రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు విశాఖ వచ్చే సూచనలున్నాయి.

వన్డేల్లో డబుల్‌సెంచరీ హీరోలు ఇషాన్ కిషాన్, శుభమన్ గిల్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లితో పాటు జట్ల సభ్యులు రానున్నారు.

108లో సుఖ ప్రసవాలు

రాజవొమ్మంగి: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రసవించింది. మండలంలోని వంచంగి గ్రామానికి చెందిన కోసూరి లోవకుమారికి పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి కుటుంబసభ్యులు సమాచారం ఇచ్చారు. ఆమెను 108లో ఏలేశ్వరం కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో గొంటువానిపాలెం వద్ద పురిటినొప్పులు అధికం అయ్యాయి. దీంతో ఆశా వర్కర్ కుమారి సాయంతో 108 సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. లోవకుమారికి ఇది నాల్గో కాన్పు అని, ఆమె రక్తహీనతతో బాధపడుతున్నట్లు ఆశ వర్కర్ కుమారి తెలిపింది. కాగా తదుపరి వైద్యం కోసం తల్లీబిడ్డలను ఏలేశ్వరం కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని ఈఎంటీ అర్జున్, పైలెట్ బాబూజీ తెలిపారు.

పాడేరు రూరల్ : పురిటి నొప్పులు వచ్చిన ఓ నిండు గర్భిణిను ప్రసవం కోసం 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో సుఖ ప్రసవం చేశారు. హుకుంపేట మండలం కామయ్యపేట గ్రామానికి చెందిన పాంగి మణి (33)అనే గర్భిణికు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారమిచ్చారు. వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో మార్గంమధ్యంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి.

పాడేరు సమీపంలో చింతలవీధి వద్ద ఈఎంటీ గుర్రాల తిరుపతిరావు, పైలాట్ జి.లక్ష్మణ్ ఆమెకు సుఖ ప్రసవం చేశారు. దీంతో ఆమె పండంటి శిశువును ప్రసవించింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని పాడేరు నవజాత శిశు సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు 108 ఈఎంటీ తిరుపతిరావు తెలిపారు.



శిశువును ఆశా కార్యకర్తకు అప్పగిస్తున్న సిబ్బంది

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

- 28 వరకు గడువు
- 30న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

పాడేరు రూరల్ : రాష్ట్ర గిరిజన జాతరగా పేరొందిన పాడేరు మోదకొండమ్మ తల్లి జాతర ఉత్సవాల సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే, అలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కొట్టగుల్లి సుబ్బారావు, ఎ.రాజారావు, వి.మహేష్, కె.దుర్గారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీలో ప్రథమ బహుమతిగా రూ.75వేల నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతిగా రూ.25వేల నగదు, షీల్డ్ బహుమతులు అందజేస్తామన్నారు. దీంతో పాటు టోర్నీలో ప్రతిభ కనబర్చిన జట్లకు, క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.3వేలు రుసుము చెల్లించాలని తెలిపారు. క్రికెట్ పీస్ బాల్‌తో పోటీలు జరుగుతాయన్నారు. టీమ్‌లు తప్పనిసరిగా క్రికెట్ నిబంధనలు పాటించాలని యూనిఫాం, షూ ధరించాలన్నారు. క్రికెట్ మేనేజ్‌మెంట్ వద్ద క్రికెట్ కిట్ నిత్యం అందుబాటులో ఉంటుందన్నారు. టోర్నీలో పాల్గొనే ఆసక్తి గల జట్లు ఈ నెల 28లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 29న క్రీడాకారుల సమక్షంలో డ్రా తీసి 30న క్రికెట్ పోటీలను ప్రారంభిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8500574489, 8309668683, 9390824178 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఏపీ పీజీ సెట్ కార్యాలయం ప్రారంభం

ఏయూక్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పీజీసెట్ కార్యాలయాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ ఆచార్య రమణయ్యకు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, జి.శశిభూషణ రావు, ఎస్.కె భట్టి, వి.వి జయలక్ష్మి, ఆచార్య భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

గిరిజన ప్రాంతాలపై అధ్యయనం

- రాష్ట్ర డిప్యూటీ ఫారెస్ట్ అధికారి రమణమూర్తి

అరకులోయ రూరల్: గిరిజన ప్రాంతాల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు యాత్ర నిర్వహిస్తున్నామని రాష్ట డిప్యూటీ ట్రైనీ ఫారెస్ట్ అధికారి రమణమూర్తి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట ఫారెస్ట్ అకాడమి రాజమహేంద్రవరం నుంచి 55 మంది ఫారెస్ట్, బీట్ అధికారులతో కూడిన బృందం సభ్యులు అరకులోయను సందర్శించారు. గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కాఫీ మ్యూజియాన్ని తిలకించారు. ఇక్కడ స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ఫారెస్ట్, బీట్ అధికారులకు గిరిజన ప్రాంత స్థితిగతులు, ఆచార సంప్రదాయాలను అధ్యయనం చేసేందుకే ఏడు రోజుల పాటు యాత్ర నిర్వహిస్తుమన్నారు.

రేషన్ బియ్యం వాహనం బోల్తా

హుకుంపేట: మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు పాములాయి గ్రామం వద్ద రేషన్ బియ్యం వాహనం ప్రమాదానికి గురైంది.పాములాయి గ్రామంలో బియ్యం పంపిణీ చేసేందుకు కామయ్యపేట నుంచి వాహనం వెళ్లింది. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనం రోడ్డు కిందకు జారి పోయింది.



ప్రమాదానికి గురైన బియ్యం వాహనం

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

హుకుంపేట: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ సతీష్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చీకుమద్దుల పంచాయతీ పెదనందిపుట్టు గ్రామానికి చెందిన వంతాల నాగేశ్వరరావు(26) సమీపంలోని కొండపైకి వెళతానని ఇంటి నుంచి బయలుదేరాడు. అప్పటి నుంచి కనిపించడం లేదని అతని భార్య సంగీత జనవరి 26న పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాలించినా ఫలితం లేకపోయింది. సమీప గ్రామాలకు చెందిన కొందరు గిరిజనులు బొడ్డెంగులు తీసేందుకు కొండపైకి వెళ్లగా ఒక లోయలో మృతదేహం కనిపించింది. వారి సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించిన కుటుంబ సభ్యులుగా నాగేశ్వరరావుగా నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నాగేశ్వరరావుకు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం తొలగింపు



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది.

కూనవరం: ఉరుములు, మెరుపులతో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూనవరం నుంచి చట్టీ వెళ్లే రహదారిలో సీతారామపురం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా భారీ భారీవృక్షం విరిగిపడింది. దీంతో రాజమండ్రి, కాకినాడ నుంచి కూనవరం వచ్చే బసులకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఫైర్ ఇంజన్ సిబ్బంది సమాచారం అందించారు. రాత్రి 10.00 గంటల సమయంలో ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, రెండున్నర గంటల పాటు వర్షం, ఈదురుగాలులలో శ్రమించి రహదారికి అడ్డంగా కూలిన వృక్షాన్ని తొలగించారు. వాహనాల రాకపోకలకు లైన్‌క్లీర్ చేశారు. ఫైర్ ఇంజన్ సిబ్బందికి ప్రయాణికులు, స్థానికులు అభినందించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పాయకరావుపేట: రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. శుక్రవారం ఉదయం విశాఖపట్నం నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందినట్టు చెప్పారు. మృతుడు తెలుపురంగు షర్టు, కాఫీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. బోదకాళ్లు ఉన్నట్టు తెలుస్తోందని, మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి తరలించినట్టు ఎస్.అబ్దుల్ మారూఫ్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంతగిరి: మండలంలోని భీసుపురం సమీపంలోని కాఫీ తోటల వద్ద కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా, ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. విజయనగరం ప్రాంతానికి చెందిన వారు వ్యాపార నిమిత్తం అరకులోయ వారపు సంతకు ఆటోలో వెళ్లి తిరిగివస్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న కె.రాజ్‌కుమార్, పి.మాధన్‌లకు తీవ్ర గాయాలు కాగా, రాముకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలోని అనంతగిరి ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.



కాఫీ తోటల వద్ద ప్రమాదానికి గురైన కారు, ఆటో